ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

చిత్తూరు

జిల్లా వార్తలు

మంగళవారం 9 జూలై 2024

వివాదాస్పద ఎస్‌ఐ బదిలీ

- పుంగనూరు నియోజకవర్గం నుంచి పలమనేరుకు..
- ఇన్నాళ్లు టీడీపీ శ్రేణులే లక్ష్యంగా హత్యాయత్నం కేసులు
- స్టేషన్‌కు వచ్చే ఇరువర్గాల నుంచీ వసూళ్లు
- పెద్దిరెడ్డిని ప్రసన్నం చేసుకుంటూ విధులు

చిత్తూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పలువురు పోలీసు అధికారులు కండువా వేసుకోని వైసీపీ నాయకుల్లా పనిచేశారు. పుంగనూరు నియోజకవర్గంలో అయితే ఏకపక్షంగా పనిచేసి పలువురు సస్పెండు.. బదిలీ అయ్యారు. ఈ నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులే లక్ష్యంగా హత్యాయత్నం.. అక్రమ కేసుల్ని నమోదు చేసిన ఎస్‌ఐ ఒకరు తాజాగా బదిలీ అయ్యారు. ఇతడిపై విపరీతంగా వస్తున్న ఫిర్యాదుల దృష్ట్యా ఎస్పీ మణికంఠ బదిలీ వేటు వేశారు. స్టేషన్‌ను పూర్తిగా అప్పగించకుండా పలమనేరు నియోజకవర్గంలోని ఓ స్టేషన్‌లో సీఐ కింద పనిచేసేలా పోస్టింగ్ ఇచ్చారు. పుంగనూరు నియోజకవర్గంలో ఎస్‌ఐగా పనిచేసిన ఆయనపై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. ఆ మండలంలో ఓ భార్యాభర్తల జంట గొడవ పడి స్టేషన్‌కు వచ్చారు. ఎస్‌ఐ సదరు మహిళ నుంచి రూ.లక్ష డిమాండ్ చేశారు. ఆమె డబ్బులు లేవని చెప్పడంతో కానిస్టేబుల్ ద్వారా పాన్ బ్రోకర్‌ని స్టేషన్‌కు పిలిచారు. ఆమె తాళిబొట్టును తాకట్టు పెట్టి రూ.60 వేలు తీసుకున్నట్లు ఆరోపణలున్నాయి. మండలంలో టీడీపీ శ్రేణులు, సానుభూతిపరుల మీద వైసీపీ నాయకుల వద్ద ఫిర్యాదులు తీసుకుని అనేక కేసులు పెట్టారు. ఓ గ్రామంలో వైసీపీ నేత వద్ద రూ.లక్ష లంచం తీసుకుని వారం రోజుల్లో ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లే ఓ యువకుడి మీద అక్రమ కేసు పెట్టినట్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. చెన్నైలో స్థిరపడిన ఓ డాక్టర్‌కు, అతడి బంధువుల మధ్య ఏర్పడిన భూసమస్యను పరిష్కరిస్తానని రూ.లక్ష తీసుకుని పట్టించుకోలేదు. పెద్దిరెడ్డి వద్ద మెప్పు పొందేందుకు ఓసందర్భంలో తన స్టేషన్‌లోనే బీసీవై అధినేత రామచంద్రయాదవ్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ హయాంలో ఇతడిపై వచ్చిన ఆరోపణల్ని విచారించిన ఉన్నతాధికారులు అప్పటి మంత్రి పెద్దిరెడ్డి ఒత్తిడి మేరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలుస్తోంది. తాజాగా, ఎస్పీ ఇతడిని బదిలీ చేసి స్టేషన్‌ను అప్పగించలేదు.

వరసిద్ధుడి హుండీ ఆదాయం రూ.1.32 కోట్లు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

ఐరాల(కాణిపాకం): కాణిపాక వినాయకస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.132,32,171 లభించినట్లు ఈవో వెంకటేశు తెలిపారు. సోమవారం ఆలయ ఆస్థాన మండపంలో ఈవో పర్యవేక్షణలో హుండీలను లెక్కించారు. 92 గ్రాముల బంగారు, 1.160 కేజీల వెండితోపాటు 1431యూఎస్‌ఏ, 20 ఆస్ట్రేలియా, 17 సింగపూర్, 5 కెనడా డాలర్లు, 1,016 మలేసియా రింగిట్స్, 10 యూరోలు, 605 యూఏఈ దిర్హామ్స్ లభించాయి. గో సంరక్షణ హుండీ ద్వారా రూ.11,586, నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.32,231 సమకూరినట్లు ఈవో వెల్లడించారు. ఆలయానికి ఈ ఆదాయం 19 రోజులలో లభించినట్లు తెలిపారు. ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, హరిమాధవరెడ్డి, ధనంజయ, పర్యవేక్షకులు కోదండపాణి, శ్రీధర్‌బాబు, బాలరంగస్వామి, మల్లికార్జున, హుండీ ఇన్‌స్పెక్టర్ సుబ్రహ్మణ్యంనాయుడు పాల్గొన్నారు.

పుంగనూరు విధ్వంసంపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులపై పునర్విచారణ చేపడతాం. కక్షపూరితంగా వ్యవహరించిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తప్పవు. పుంగనూరులో పెద్దిరెడ్డి రాజ్యాంగం నడుస్తూ టీడీపీ శ్రేణులపై పెట్టిన తప్పుడు కేసులకు విముక్తి కల్పిస్తాం.

\- ఇటీవల హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చేసిన ప్రకటన ఇది.

వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ శ్రేణులపై పెట్టిన తప్పుడు కేసులపై కమిటీ వేస్తాం. త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటాం.

\- తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చెప్పిన మాట ఇది.

అటు ప్రభుత్వ పరంగా.. ఇటు పార్టీ పరంగా వచ్చిన ఈ ప్రకటనలు వైసీపీ కుట్ర కేసుల్లో ఇరుక్కున్న బాధిత టీడీపీ శ్రేణులకు ఊరటనిచ్చాయి అక్రమ కేసుల నుంచి విముక్తి కలుగుతుందన్న ఆశతో ఉన్నారు.

\- పుంగనూరు



పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో నిద్రపోతున్న చల్లా రామచంద్రారెడ్డి, పక్కనే పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్‌.శ్రీనివాసులురెడ్డి (ఫైల్ ఫోటో)

అక్రమ కేసులనుంచి విముక్తి లభించేనా?

- ఒక ఘటన.. ఏడు ఫిర్యాదుల్లో 500 మందిపై హత్యాయత్నం కేసులు
- పుంగనూరులోని బాధిత టీడీపీ శ్రేణుల్లో చిగురించిన ఆశలు

ఇకనైనా అక్రమ కేసుల నుంచి విముక్తి లభిస్తుందనే ఆశతో పుంగనూరులోని బాధిత టీడీపీ శ్రేణులున్నాయి. గతేడాది ఆగస్టు నాలుగోతేది 'ప్రాజెక్టుల విధ్వంసం- పరిశీలన' పేరిట పుంగనూరు మీదుగా చంద్రబాబు చిత్తూరు వెళ్లాల్సిఉంది. వైసీపీ శ్రేణులు, పోలీసులు రెచ్చగొట్టడంతో భీమగానిపల్లె క్రాసులో టీడీపీ శ్రేణులు ఎదురు తిరిగాయి. ఈ క్రమంలో జరిగిన లాఠీచార్జ్, రాళ్ల దాడులు, వాహనాల విధ్వంసం, దహనం వంటివి జరిగాయి. పుంగనూరుతో పాటు వివిధ ప్రాంతాల్లో వైసీపీ వీరభక్త పోలీసు అధికారులు.. టీడీపీలోని క్రియాశీలక నేతలు, కార్యకర్తలపై కేసులు పెట్టారు. ఈ ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వీరు వైసీపీకి అడ్డురాకుండా ఉండేలా అప్పట్లో విపరీతంగా కేసులు పెట్టారన్న ఆరోపణలున్నాయి. పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని 7 కేసుల్లో ఏ1గా.. దీనికి సంబంధించి మరికొన్ని కేసుల్లో నాటి రాయచోటి టీడీపీ నేత, ప్రస్తుత మంత్రి అయిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిపై 307తో పాట ఇతర కఠిన సెక్షన్లతో కేసులు పెట్టారు. పుంగనూరు, పలమనేరు, కుప్పం, కదిరి, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాలకు చెందిన 500 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులపై హత్యాయత్నం.. వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వేలాది మంది టీడీపీ శ్రేణులు అజ్ఞాతంలో ఉండేలా పోలీసులు ఇబ్బందులు పెట్టగా.. అరెస్టు చేసినవారిని చిత్రహింసలకు గురిచేశారు. పుంగనూరు పోలీసులు చాలామందిని అరెస్టు చేసి అక్రమంగా టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు విధ్వంసాలకు పాల్పడి కొంతమందిని హతమార్చి సానుభూతి పొందాలని కుట్ర చేసినట్లు అంగీకార పత్రాల్లో సంతకాలు చేయించారు.

చంద్రబాబును ఇరికించాలని..

సెప్టెంబరు నాలుగోతేది టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సహా 66 మంది పుంగనూరు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి ఎదుట లొంగిపోయారు. నాటి ప్రతిపక్షనేత, ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో పుంగనూరులో విధ్వంసం చేయించినట్లు నేర అంగీకారపత్రంలో సంతకం చేయించాలన్న అప్పటి డీఐజీ అమ్మిరెడ్డి, ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నాటి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు అశోక్‌కుమార్, రాఘవరెడ్డి తదితరులు తీవ్రస్థాయిలో ఒత్తిడి తేవడంతో ఆయన నిరాకరించారు. చంద్రబాబు తమకేమీ చెప్పలేదని, తానూ సంఘటనలో లేనని, కేవలం పెద్దిరెడ్డి స్వలాభం కోసం అన్యాయంగా కేసులు పెట్టడం భావ్యంకాదని, తనను ఏమైనా చేసుకోండని ఎదురు తిరిగారు. దీంతో చల్లాబాబును వెంటనే కోర్టులో హాజరుపరచకుండా పోలీస్‌స్టేషన్‌లో ఉంచుకుని మానసికంగా ఇబ్బందిపెట్టారు. చల్లాబాబు వెంట ఆయనకు అండగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులురెడ్డి ఉంటూ పోలీసుల చర్యలకు ఎదురుతిరిగారు. పుంగనూరు నుంచి రెండురోజులకు అనారోగ్యంతో ఉన్న చల్లాబాబును కడప సెంట్రల్ జైలుకు పోలీసులు ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులో తరలించారు. ఇప్పటికీ ఆ ఘటనకు సంబంధించి ఏడు కేసుల్లోని 68 మంది పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

నిందితుల పేర్ల జాబితా పెంచేశారు

గొడవ మధ్యాహ్నం జరగ్గా టీడీపీ వారు కూడా చాలా మంది గాయపడ్డారు. బయటప్రాంతాలకు చెందిన ఏడుగురు పోలీసులచే ఫిర్యాదులు ఇప్పించి.. రాత్రికంతా వందలమంది టీడీపీ శ్రేణులపై హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. వైసీపీ నేతలు ఇచ్చిన జాబితా మేరకు పెద్దిరెడ్డి భక్తపోలీసులు నిందితుల జాబితాలో సంఖ్యను 500కు పెంచేశారు. ఇక, వి.కోటలోని టీడీపీ నేతలు పుంగనూరుకు రాకున్నా.. వారిపైనా కేసులు పెట్టడం నాటి పోలీసుల తీరుకు నిదర్శనం. వి.కోటలో జరిగిన ఓ ఆందోళనలో ఆ నేతలు పాల్గొన్నారు. ఇక, విచ్చలవిడిగా కేసులు పెట్టిన పోలీసులు చాలా మంది చిరునామాలను కనుక్కోలేకపోయారు. చార్జిషీట్ వేయకపోవడం తదితర కారణాలతో గత ఏడాది ఆగస్టు 4న జరిగిన ఘటన కేసుల్లోనివారిని ఇంతవరకు కోర్టుకు హాజరు కావాల్సిందిగా ఆదేశించలేదు.

60మందికిపైగా టీడీపీ శ్రేణులపై రౌడీషీట్లు

పుంగనూరు నియోజవర్గంలో 60 మందికిపైగా టీడీపీ శ్రేణులపై పోలీసు అధికారులు రౌడీషీట్లు తెరిచారు. అడ్వకేట్ నవీన్‌కుమార్‌యాదవ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలపై రౌడీషీట్లు తెరిచి ఎన్నికలకు దూరం చేయాలన్నది అప్పట్లో పోలీసుల వ్యూహం. అప్పటి డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ రాఘవరెడ్డి పుంగనూరు మండలంలో 13 మందిపై రౌడీషీట్లు తెరిచారు. దౌర్జన్యాలు, బెదిరింపులు, దాడులు, అరాచకాలకు పాల్పడిన వారికి మాత్రం పోలీసులు రెడ్‌కార్పెట్ వేయడంపై నాడు విమర్శలు వచ్చాయి. కాగా, పుంగనూరు నియోజకవర్గంలో డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు బి.రాఘవరెడ్డి, టి.మధుసూదన్‌రెడ్డి, ఎం.గంగిరెడ్డి, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, అశోక్‌కుమార్ తదితరులు పెద్దిరెడ్డి ఆదేశాలతో టీడీపీ శ్రేణులపై ఏకపక్షంగా కేసులు పెట్టడం, హింసించడం వంటి చర్యలకు పాల్పడినట్లు విమర్శలున్నాయి.

జిల్లాలో విస్తృతంగా వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 8: జిల్లావ్యాప్తంగా వారం రోజులుగా వర్షం కురుస్తోంది. గడచిన 24 గంటల్లో 23 మండలాల్లో తేలికపాటి నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా జీడీనెల్లూరులో 54, అత్యల్పంగా పులిచెర్లలో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. అలాగే వెదురుకుప్పంలో 40.6, చిత్తూరు రూరల్ 37.6, కార్వేటినగరం 31.4, పాలసముద్రం 31.2, విజయపురం 27.4, పెనుమూరు 24, నగరి 22.4, చిత్తూరు అర్బన్ 19.6, నింద్ర 18.2, తవణంపల్లె 17.4, పూతలపట్టు 16, ఐరాల 12.4, ఎస్ఆర్‌పురం 10.4, చౌడేపల్లె 7.6, బంగారుపాళ్యం 7.2, యాదమరి 6.8, పుంగనూరు 6.4, గుడిపాల 4.2, గంగవరం 2.8, పెద్దపంజాణి 2, పలమనేరు 1.6 మి.మీ వర్షం కురిసింది.

ఏటీఎంలో నగదు చోరీపై కొనసాగుతున్న దర్యాప్తు

గుడిపాల, జూలై 8: మండలంలోని గుడిపాల ఎస్బీఐ ఏటీఎంలో చోరీకి సంబంధించి దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. మూడు టీములుగా ఏర్పడిన పోలీసులు దుండగుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు. డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, వెస్ట్ సీఐ రవిశంకర్, ఎస్‌ఐ నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు కలెక్టర్లు, పోలీసులతో చర్చించారు.

అమల్లోకి ఉచిత ఇసుక

చిత్తూరు రూరల్‌లో ప్రారంభించిన కలెక్టర్, ఎమ్మెల్యే ● గంగ్రాజుపల్లెలో నేడు ప్రారంభం

చిత్తూరు రూరల్, జూలై 8: ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. వైసీపీ హయాంలో ఇసుక ధరలు విపరీతంగా పెంచేశారు. దీని ప్రభావం నిర్మాణ రంగంపై పడింది. ఇక, సామాన్యులకు ఇసుక దొరకడమే గగనంగా మారింది. ఈ క్రమంలో తాము అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టిన 25 రోజుల్లోనే ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు. జిల్లాకు సంబంధించి చిత్తూరు రూరల్ మండలం పాలూరు, దిగువమాసాపల్లి వద్ద.. గంగవరం మండలం గంగ్రాజుపల్లెలోని స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక అందించనున్నారు. అనుమతులు ఆలస్యంగా రావడంతో తొలిరోజైన సోమవారం పొద్దుపోయాక పాలూరు, దిగువమాసాపల్లె వద్ద ఇసుక స్టాక్ పాయింట్‌లో ఈ కార్యక్రమాన్ని కలెక్టరు సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తదితరులు ప్రారంభించారు. మంగళవారం నుంచి ఇక్కడ ఇసుక అందుబాటులో ఉంటుంది. గత ప్రభుత్వంలో ఇసుకను జగన్మోహన్‌రెడ్డి తన జేబు సంస్థ అయిన జేపీ కంపెనీకి ఇచ్చి రూ.వేల కోట్లు దోచుకున్నాడని ఎమ్మెల్యే గురజాల విమర్శించారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయుడు మాత్రం పేదలు ఇబ్బంది పడకూడదని ఇసుకను ఉచితంగా తీసుకొచ్చారన్నారు. టన్నుకు వసూలు చేసే రూ.155 కూడా ఇసుకను రేవు నుంచి డంపింగ్ కేంద్రం వరకు తీసుకొచ్చేదానికి రవాణా చార్జీలు మాత్రమేనన్నారు. జిల్లాలోని రెండు ఇసుక డిపోల ద్వారా ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేస్తామని కలెక్టర్ చెప్పారు. ప్రస్తుతానికి ట్రాక్టర్, 10 పన్నుల టిప్పర్లను మాత్రమే అనుమతిస్తామని చెప్పారు. ఫిర్యాదుల కోసం 08572-299509 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, మైన్స్ డీడీ ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ కఠారి హేమలత, టీడీపీ నాయకులు సురేంద్రకుమార్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. కాగా, గంగవరం మండలం గంగ్రాజుపల్లె సమీపంలో మంగళవారం ఉచిత ఇసుకను ప్రారంభించనున్నారు.



ఉచిత ఇసుక కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే గురజాల

జిల్లా స్థాయిలో ఇసుక కమిటీ

- కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చిత్తూరు కలెక్టరేట్, జూలై 8: ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి జిల్లాలో అమల్లోకి వచ్చింది. దీని పర్యవేక్షణకు జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటైంది. కలెక్టర్ చైర్మన్‌గా ఏర్పడిన ఈ కమిటీకి కన్వీనర్‌గా జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఉంటారు. సభ్యులుగా ఎస్పీ, జేసీ, సంబంధిత డివిజన్ల ఆర్డీవోలు, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫీసర్, డీపీవో, డీటీసీ, భూగర్భజలశాఖ డీడీ, ఇరిగేషన్ శాఖ ఈఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, కాలుష్య నివారణ కంట్రోల్ బోర్డులోని పర్యావరణ ఇంజనీర్లు, కలెక్టర్ సూచించే జిల్లా అధికారులు ఉంటారు. అక్రమ తవ్వకాలు, రవాణా జరగకుండా ఈ కమిటీ ఆధ్వర్యంలో నిఘా ఉంటుంది. ప్రతి నిల్వ కేంద్రం వద్ద వీఆర్వో, వీఆర్ఏ లేదా సచివాలయ అధికారిని కమిటీ నియమిస్తుంది. లోడింగ్, ర్యాంపు నిర్వహణ, సెక్యూరిటీ ఏర్పాట్లను వారు పర్యవేక్షిస్తారు. కలెక్టరేట్‌లో జేసీ జిల్లా స్థాయిలో, డివిజన్ స్థాయిలో ఆర్డీవో పర్యవేక్షణలో కంట్రోల్ రూములు ఏర్పాటు చేస్తారు. నిబంధనలు అతిక్రమించి వారిపై లేదా ఇసుకను దుర్వినియోగం చేస్తూ పట్టుబడ్డ వాహనాలకు జరిమానా, కేసుల నమోదు, ఇతరత్రా పనులకు కలెక్టర్ అధ్యక్షతన 13 మంది అధికారులతో మరొక కమిటీని ఏర్పాటు చేస్తున్నారు.

అనర్హులకు ఉద్యోగాలు ఎలా ఇస్తారు?

నియామకాలు, అడ్డగోలు పదోన్నతులపై జేసీ సీరియస్ ● అధికారులతో సమీక్ష

కుప్పం, జూలై 8: కుప్పం రెస్కోలో అక్రమ నియమకాలపై పర్సన్ ఇన్‌చార్జి అయిన జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు సీరియస్ అయ్యారు. ఆయా అంశాలపై 'ఆంధ్రజ్యోతి'లో వస్తున్న వరుస కథనాలపై స్పందించిన ఆయన.. సోమవారం సాయంత్రం కుప్పంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో సంస్థ అధికారులతో సమీక్షించారు. మొత్తం 122 మంది ఉద్యోగుల్లో 109 మందికి అర్హత పరీక్షలు నిర్వహించగా, అందులో కేవలం సుమారు 40-50 మంది మాత్రమే పోల్స్ ఎక్కడం, ఇతర పరీక్షల్లో అర్హత సాధించడం ఏమిటని ఆశ్చర్యపోయారు. మరికొంతమంది ఉద్యోగులకు అవసరమైన సర్టిఫికెట్లు కూడా లేకపోవడాన్ని తప్పుపట్టారు. ఇంత గుడ్డిగా, అక్రమంగా ఉద్యోగాలు ఇవ్వడంపై అధికారులను నిలదీశారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు మూడు రోజులముందు వివిధ కేడర్లకు చెందిన 52 మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంపైనా జేసీ ప్రశ్నించారు. మొత్తం రెస్కోలో ఎన్నో అవకతవకలు జరిగాయని దీనివల్ల తెలుస్తోందన్నారు. అన్ని వివరాలతో కూడిన నివేదికను తనకు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ఎండీగా ప్రస్తుత అధికారి పదోన్నతి కూడా ప్రశ్నార్థకంగా ఉన్నదన్నారు. వీటన్నింటిపై అన్ని అంశాలను పరిశీలించి రెండుమూడు రోజుల్లో నిర్ణయం తీసుకుంటానని జేసీ స్పష్టంచేశారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ కూడా ఇదే అంశంపై నిలదీసినట్లు తెలిసింది. కానీ సమావేశంలో పాల్గొన్న ఇతర టీడీపీ నాయకులు రెస్కో అవినీతిపై పెద్దగా నిలదీయలేదని సమాచారం. ఇంత సమీక్ష జరిపిన జేసీ సైతం, అధికార పార్టీ నేతల తీరు చూసి, చివరకు కొంత తన స్పీడ్ తగ్గించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో రెస్కో ఎండీ ప్రభాకర్‌తోపాటు డీఈలు, ఏడీఈలు, ఇతర ఉద్యోగులు, టీడీపీ నాయకులు పీఎస్ మునిరత్నం, డాక్టర్ సురేష్, మనోహర్ పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

విద్యార్థులే సమాజ నిర్ణేతలు: కంచర్ల

కుప్పం, జూలై 8: నేటి విద్యార్థులే రేపటి భావి భారత సమాజ నిర్ణేతలని ఎమ్మెల్సీ కంచర్ల పేర్కొన్నారు. కుప్పంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఆయన పాఠ్య పుస్తకాలను, స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్య ఒక్కటే ఆర్థిక అసమానతలను తొలగించే ఆయుధమన్నారు. క్రమశిక్షణతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరవచ్చని పేర్కొన్నారు.పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం తరఫున ఎటువంటి సాయం కావాల్సి వచ్చినా ముఖ్యమంత్రితో మాట్లాడి అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లు, ఎంఈవోలు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో టీడీపీ నాయకుడి మృతి


శ్రీనివాసులు

వి.కోట, జూలై 8: నెర్నిపల్లె పంచాయతీ మిట్టూరుకు చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు (51) అనారోగ్యంతో మృతిచెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇంట్లోనే చనిపోయారు. ఆయన మరణం పట్ల పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే టీడీపీ మండల అధ్యక్షులు రంగనాథ్, తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, ఇతర నాయకులు శబరీష్, సతీష్, గుణ, విశ్వనాథ్, మురుగేస్, నారాయణరాజు, రాజారెడ్డి, వెంకట్రామప్ప, లక్ష్మణ్‌చౌదరి తదితరులు ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వి.కోట మేజర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులుగా, సమన్వయ కమిటీ సభ్యులుగా ఆయన వ్యవహరించారు.

ఐదుగురు విద్యార్థులకు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్

పుంగనూరు రూరల్, జూలై8: మండలంలోని అడవినాథునికుంట మోడల్ స్కూల్లో ఐదుగురు విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమ తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు నాగసాయి రెడ్డి, గీతిక, గౌరిశశిధర్, వైష్ణవి, మయూన్‌తాజ్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు నేషనల్ మెరిట్‌స్కాలర్‌షిప్ ద్వారా ప్రతి ఏటా రూ.12వేలు ప్రభుత్వం అందజేయనున్నట్లు తెలిపారు.

పాడి రైతులకు పశుగ్రాస విత్తనాల పంపిణీ



గుడుపల్లె, జూలై 8: మండలంలోని పాడి రైతులకు ప్రభుత్వం75 శాతం సబ్సిడీపై అందించే పశుగ్రాసం విత్తనాలను పశు వైద్యశాలలో సోమవారం టీడీపీ మండ లాధ్యక్షుడు బాబునాయుడు రైతులకు పంపిణీ చేశారు. పశుగ్రాసం విత్తనాలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు తీసుకొచ్చి మొక్కజొన్న కేజీ రూ.17, జొన్న కేజీ రూ.23 చొప్పున గరిష్టంగా 20 కేజీల వరకు ఆర్బీకేల్లో తీసుకోవచ్చని పశు వైద్యురాలు ఆమని తెలిపారు.

వైభవంగా అగ్నిగుండం ప్రవేశం

గుడుపల్లె, జూలై 8: పెద్దబజనవాడలో గంగమ్మ అగ్నిగుండ ప్రవేశం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయం వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి ఆలయ పూజా రులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి అమ్మవారిని పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంక రించి పుష్పాలతో అలంకరించిన పల్లకిపై అధిష్ఠింపజేశారు. డప్పువాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగిం చారు. ఆ తరువాత పచ్చిగెరిగె, అమ్మవారు అగ్నిగుండం ప్రవేశం చేశారు. అనంతరం గంగమ్మకు గ్రామంలోని మహిళలు పిండిదీపాలు వెలిగించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కాశీవిశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం

రామకుప్పం, జూలై 8: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అర్చకులు స్వామి వారికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. సాయంత్రం ఉభయదారులు కుమ్మరికనక రాజు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

వేడుకగా అర్జున తపస్మాన్

కల్లూరు, జూలై 8: పులిచెర్ల మండలం మంగళంపేటలో కొన సాగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం అర్జున తపస్మాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్జునుడి వేషధారి తపస్మాన్‌ను ఒక్కో మెట్టు ఎక్కుతూ పద్యాలు వినిపిస్తూ తపస్మాన్ పైభాగానికి చేరుకొని భక్తులపైకి నిమ్మకాయలు, విభూది తదితరాలు విసిరారు. వాటి కోసం భక్తులు ఎగబడ్డారు. ఉభయదారులుగా తిరుపతికి చెందిన కేవీ రమణ, గడ్డంవారిపల్లికి చెందిన రమణారెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

రేపు పలమనేరు మున్సిపల్ సమావేశం

పలమనేరు: స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈనెల 10 వతేదీ ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ ఛాముండేశ్వరి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు.

క్యాంపస్ సెలెక్షన్స్‌లో 88 మంది ఎంపిక

పుంగనూరు రూరల్, జూలై8: పుంగనూరు మైనార్టీ ఐటీఐ కాలేజీలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో 88 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు. పుంగనూరు, అన్నమయ్య జిల్లాలోని తంబళ్లపల్లె ఐటీఐ కళాశాలలకు చెందిన 108 మంది విద్యార్థులు పాల్గొనగా 88మంది ఎంపికైనట్లు వివరించారు. హైదరాబాదు, బెంగళూరు రాష్ట్రాలకు చెందిన కంపెనీలు విద్యార్థులను ఎంపిక చేసుకున్నాయని ఆయన వెల్లడించారు.

తవడపల్లిలో భగవద్గీతపై ప్రచారం

పలమనేరు, జూలై8 : మండలంలోని తవడపల్లిలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవాసమితి ఇందుజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. భగవద్గీత పుస్తకాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రబోధసేవాసమితి ఇందుజ్ఞానవేదిక బంగారుపాళ్యం, పలమనేరు కమిటీ అధ్యక్షులు భాస్కర్, బాలాజి, సభ్యులు రాజేంద్ర, రేఖ, కళ్యాణి, జీవరత్న, నాగమ్మ, హేమంత్, జ్యోతి, రెడ్డెమ్మ పాల్గొన్నారు.

బస్సుషెల్టర్ ఆక్రమణ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పలమనేరు, జూలై8: పలమ నేరులోని జాతీయ రహదారిలో రంగబాబు సర్కిల్ వద్ద బస్సు షెల్టర్ ఆక్రమణలను అధికారులు తొలగించారు. ఆంధ్రజ్యోతిలో సోమవారం 'బస్సుషెల్టర్ ఆక్రమణ' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. మున్సిపల్ సిబ్బంది స్పందించి వెంటనే షెల్టర్ వద్ద ఆక్రమణలను తొలగించారు.

పుంగనూరు సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ జయరామ్

పుంగనూరు, జూలై8: పుంగనూరు సీఐగా జయరామ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న రాఘవరెడ్డి ఎన్నికల ఫలితాలు వెలువడగానే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో చిత్తూరులో సీఐగా పనిచేస్తున్న జయరామ్‌ను పుంగనూరు బదిలీ చేస్తూ ఎస్పీ మణికంఠ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్, చోరీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

రైతుల ట్రాన్స్‌ఫార్మర్లపై శ్రద్ధచూపండి

సోమల, జూలై 8: రైతుల వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల విషయంలో ట్రాన్స్‌కో సిబ్బంది శ్రద్ధచూపాలని ఏఈ మహేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సబ్‌స్టేషన్‌లో మండలంలోని ట్రాన్స్‌కో సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాని కోరారు. విద్యుత్ బకాయిలు వసూళ్లు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సోమల, ఆవులపల్లె, నంజంపేట, కందూరు, ఇరికిపెంట, నెల్లిమంద సబ్‌స్టేషన్ల పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బంది, ఎల్‌ఐలు చిన్నప్పరెడ్డి, సుబ్బారెడ్డి, లైన్‌మన్లు జ్యోతీశ్వరరెడ్డి, విష్ణు శంకర్‌రెడ్డి, బాబు, నవీన్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

పుంగనూరు రూరల్, జూలై8: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ వైద్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం స్థానిక తూర్పు మొగసాల ప్రాంతంలో ప్రజలకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

శాంతిపురం, జూలై 8: మండల పరిధిలోని చిన్నారిదొడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం విద్యా సామగ్రిని టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు చలపతి, నాయకులు జయరామ్, రఘుపతి, శ్రీనివాసులరెడ్డి, జయప్ప, హెచ్‌ఎం ఆనంద్, రాధ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి తెగుళ్ల నివారణపై అవగాహన

కుప్పం రూరల్, జూలై 8: కుప్పం మండలం పైపాళ్యంలో రైతులకు సోమవారం మండల ఉద్యాన అధికారి డింపుల్ ప్రియ అవగాహన కలిగించారు. కొబ్బరి చెట్లను ఆశించే నల్లముట్టి పురుగు నివారణపై క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఈ పురుగు ఆశించి ఎండిన ఆకులను తొలగించి కాల్చేయాలని చెప్పారు. పది మిల్లీ లీటర్ల మోనోక్రోటోఫాస్ మందును పది మిల్లీ లీటర్ల నీటిలో కలిపి చెట్ల వేరుకు కట్టాలన్నారు. మందు పెట్టిన తర్వాత 45 రోజుల వరకు కాయ రాదన్నారు. పురుగు సోకి ఎండిన తోటలకు ఒక కిలో యూరియా, రెండు కిలోల సూపర్ ఫాస్పేట్, రెండున్నర కిలోల మ్యూరేజ్ ఆఫ్ పొటాష్ వేసి నీరు పెడితే చెట్టు తెగులు బారినుంచి త్వరగా కోలుకుంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్మిన్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మున్సిపాలిటీగా కుప్పం

- సీఆర్డీయే అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అధికార బృందం విస్తృత పర్యటన


మురుగు కాలువలు పరిశీలిస్తున్న అధికారుల బృందం

కుప్పం, జూలై 8: కుప్పం అభివృద్ధి విష యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా అడుగులు పడుతున్నాయి. అధికార బృదంలో కదలిక ఏర్పడి, జిల్లా, రాష్ట్ర స్థాయి బృందాల పర్యటనలు జరుగుతున్నాయి. ఆయా అంశాలకు సంబంధించిన పరిశీలనలు, అంచనా నివేదికలు తయార వుతున్నాయి. మొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం పర్యటనకు వచ్చిన సందర్భంలో కుప్పం మున్సిపాలిటీని స్మార్ట్ మున్సిపాలిటీ చేస్తానని, మోడల్ టౌన్‌గా కుప్పాన్ని తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చి వెళ్లారు. రూ.100 కోట్ల స్పెషల్ గ్రాంటు ఇందుకోసం మంజూరు చేస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో రాజధాని సీఆర్డీయేకి చెందిన ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ అధికారుల బృందం సోమవారం కుప్పం మున్సిపాలిటీలో విస్తృతంగా పర్యటించింది. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో కలిసి, అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాలను సందర్శించింది. తాగునీరు, క్రీడలు, ఉద్యానవనాలు, శ్మశానాలు, భూగర్భ మురుగు కాలువలు, ఆలయాలు, పబ్లిక్ టాయిలెట్లు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, రైల్వే స్టేషన్, ఇరిగేషన్, బస్టాండ్, శిల్పారామం, ఇండస్ట్రియల్ ఏరియా, రెస్కో తదిర అంశాలను ఈ బృందం పరిశీలించింది. కుప్పం ఆర్టీసీ బస్టాండు సర్కిల్, మున్సిపల్ పార్కు, మురుగు కాలువలు తదితర ప్రాంతాలను సందర్శించి ఆయా ప్రాంతాలలో చేయాల్సిన అభివృద్ధిపై అధ్యయనం జరిపింది. అనంతరం స్థానిక ఆర్ అండ్ బీ అతిథి గృహంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులతో సమావేశమైన బృందం ప్రతి నిధులు, కుప్పాన్ని స్మార్ట్ మున్సి పాలిటీగా మార్చే ప్రతిపాదనలు, అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై చర్చలు జరిపారు. రాబోయే రోజుల్లో మరికొన్ని పర్యటనలు జరిపి, సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళిక తయారు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతానికి ప్రాథమిక నివేదిక రూపొందించే పనిలో నిమగ్నమయ్యారు. అధికారుల బృందం బి.కిరణ్, ఒ.రాజేష్ బాబు, ఎస్‌ఎం. ఇర్ఫాన్, క్రిష్ణసాయి, దుర్గాజు, వి.సాయి మనోజ్ తదితరులు పర్యటించారు. ఈ కార్య క్రమంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, టీడీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తోటకనుమలో వైద్యాధికారుల పరిశీలన

- ఇంటింటా జ్వరాలపై సర్వే
- పారిశుధ్యం మెరుగుకు చర్యలు


జ్వరాల పై విరాచణ చేస్తున్న ఏడీఎంఅండ్‌హెచ్‌వో

వి.కోట, జూలై 8: తోటకనుమ గ్రామంలో డెంగ్యూ జ్వరాలు వరుసగా నమోదు కావడం పట్ల అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డా.వెంకట ప్రసాద్ నేతృత్వంలో జిల్లా మలేరియాధికారి రామచంద్రారెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులురెడ్డి సోమవారం స్వయంగా గ్రామానికి చేరుకుని అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. డా.మాధవి, ఏఎన్‌ఎంల ఆధ్వర్యంలో వైద్య శిబిరం కొనసాగుతోందని ఎంపీడీవో గోవర్ధన్ వారికి తెలిపారు. వైద్యాధికారుల ఆదేశాల మేరకు జ్వరాల వ్యాప్తికి కారణమైన తాగునీటి ట్యాంకును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామ కార్యదర్శి నేతృత్వంలో గ్రామస్తులు శుభ్రం చేశారు. అక్కడి తాగునీటి నమూనాలను పరీక్షల నిమిత్తం ర్యాపిడ్ రెస్పాన్స్ టీం చిత్తూరుకు పంపారు. మురగునీటి కాల్వలను శుభ్రం చేశారు. దోమలు వ్యాప్తి చెందకుండా మలాథిన్ పిచికారీ చేశారు. ఏఎన్‌ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు సర్వే నిర్వహించి బాధితులకు మందులు అందించారు. కాగా డెంగ్యూ జ్వరాల బారిన పడి కుప్పం పీఈఎస్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఓగు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ్ కాంత్ స్థానిక టీడీపీ నేతలతో కలసి పరిశీలిం చారు. బాధితులు కోలుకుంటున్నారని పేర్కొ న్నారు. ఇదిలా ఉండగా ఆంధ్ర జ్యోతిలో వరుసగా ప్రచురితమైన కథనాలతో జిల్లా అధికార యంత్రాంగం తరలివచ్చి గ్రామంలో జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకున్నారని ప్రజలు అభినందనలు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా: చల్లా రామచంద్రారెడ్డి


సమస్యలు తెలుసుకుంటున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల,జూలై8: పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి భరోసానిచ్చారు. సోమవారం రొంపిచెర్లలోని ఇంటి వద్ద పలు వురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చల్లా బాబును కలి శారు. పూల మాలలు వేసి శాలు వలు కప్పి సన్మానించారు. పుంగనూరు, చౌడేపల్లి, సోమల, పులిచెర్ల, సదుం మండలాల కార్యకర్తలు, అధికారులు చల్లాబాబును కలిసి సమస్యలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా నియోజకవర్గంలో అభివృద్ధి జరుగుతోంద న్నారు. పుంగనూరు రూరల్ అధ్యక్షుడు మాధవరెడ్డి, సివిరెడ్డి, సోమల చిన్నబాబు, శివశంకర్, మణి, మురళీ నాయుడు, రామక్రిష్ణ, సుహేల్‌బాష, అమరనాథరెడ్డి, మదనమోహన్ పాల్గొన్నారు.

బోరు వేశారు.. మోటారు మరిచారు


రెండేళ్ల క్రితం వేసిన బోరు

వి.కోట, జూలై 8: వి.కోట మండలం యాలకల్లు పంచాయతీ వైసీ బండపల్లెలో తాగునీటికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పల్లెను ఆనుకుని చెరువులో ఉన్న తాగునీటి బోరు ఇంకి పోవడంతో నీటి సమస్య నెలకొంది. దీంతో రెండేళ్ల క్రితం అధికారులకు ఫిర్యాదు చేయడంతో జల్ జీవన్ మిషన్ ద్వారా ఈద్గా వద్ద కొత్తగా బోరు వేశారు. నీరు పుష్కలంగా రావడంతో తాగునీటి కష్టాలు తీరుతాయని గ్రామస్తులు భావిం చారు. అయితే రెండేళ్లుగా మోటారును అమర్చక పోవడంతో నీరున్నా ఆ బోరు నిరుపయోగంగా మారింది. దీంతో గ్రామస్తులు ఎస్సీ కాలనీలోని చేతిపంపుపై ఆధారపడాల్సి వస్తోంది. అక్కడా నీరు చాలకపోవడంతో వ్యవసాయ బోర్ల వద్దకు క్యూ కడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బోరుకు మోటారు అమర్చి తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

పలమనేరు, జూలై8 : రాష్ట్రంలోని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నాయకులు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావుకు, ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సోమవారం పలమనేరు టీడీపీ కార్యాలయం వద్ద వారిని కలిశారు. జీవో 117ను రదు చేయాలని, సీపీఎస్ రద్దుచేయాలని, పాఠశాలల్లో తెలుగు మాధ్యమం కూడా కొనసాగించాలని విజ్ఞప్తిచేశారు. ఎస్టీయూ జిల్లా ప్రధానకార్యదర్శి బి.మోహన్‌యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయండి

పెద్దపంజాణి, జూలై 8: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం సోమవారం మొదటిసారిగా పెద్దపంజాణి నాయకులతో, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తన స్వగ్రామం కెళవాతిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత పార్టీ విజయం కోసం కష్టపడిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. గత పాలనలా కాకుండా కక్షపూరిత రాజకీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. మాజీ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి, నాయకులు చెంగారెడ్డి, రాజారెడ్డి, మురహరిరెడ్డి, శ్రీరాములు, నాగరాజ, ఆనంద, చలపతి, రోజారెడ్డి, సుధాకరరెడ్డి, నాగరాజరెడ్డి, వేణుగోపాల్‌నాయుడు, కృష్ణారెడ్డి, ముబారక్‌తాజ్, మురళి, పగడాల ప్రవీణకుమార్,వేణు, గణేష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వైభవంగా పుష్పపల్లకీ సేవ

రొంపిచెర్ల,జూలై8: ముత్యాలమ్మ జాతరలో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారిని పుష్ప పల్లకీలో పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, బాణసంచా వెలు గుల మధ్య అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా సాగింది. భక్తులు అమ్మవారికి మంగళ హారతులు సమర్పించారు.

స్వయంభేశ్వరుడికి అభిషేక పూజలు

సోమల, జూలై 8: సోమలలో కొలువుదీరిన స్వయంభేశ్వర స్వామి ఆలయంలో సోమ వారం మూలవిరాట్‌కు విశేష అలంకరణలు జరిపారు. అర్చకులు స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు శెట్టివారి నాగరాజ, దీప కుటుంబసభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజల్లో అడుసుపల్లె, సోమల, దాసరివారిపల్లె, దిడ్డివారిపల్లె, గన్నావారిపల్లె గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

పుంగనూరు రూరల్, జూలై8: గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వెంగమునిరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని రాగానిపల్లె పంచాయతీలో మురుగునీటి కాల్వలను శుభ్రం చేయిస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి, కార్మికులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు

పుంగనూరు రూరల్, జూలై8: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన వారికి ఆర్టీసీ యజమాన్యం ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నట్లు పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో లక్కీ డ్రిప్‌లో గెలుపొందిన ప్రయాణికులకు బహుమతులు అందజేశారు. పుంగనూరు ఆర్టీసీ డిపో నుంచి రాయచోటి, ముళబాగల్, కలికిరి మార్గాల్లో ప్రయాణించిన ప్రయాణికులు బాషా, నాగరాజ, ఆంజి, రెడ్డెప్ప, శివకుమార్, మునివెంకట ఆకాష్‌లకు బహుమతులు అందజేశారు. ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


గంగమ్మ ఆలయాల్లో విశేష పూజలు

రామకుప్పం, జూలై 8: రామకుప్పంలో గంగజాతరలో భాగంగా రెండో రోజైన సోమవారం అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. ఉదయం దిగువవీధి గంగమ్మ, శివాజీనగర్, రెడ్డివీధి, మాదిగవాడ, రామనగర్‌కాలనీ, కోదండరామనగర్‌కాలనీల్లోని అమ్మవారి ఆలయాల్లో ఉదయం ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. కాగా మంగళవారం పచ్చిగెరిగె ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

చాతుర్మాస మహాయాగ మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

పుంగనూరు రూరల్, జూలై8: చాతుర్మాస మహాయాగ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పురోహిత బ్రాహ్మణసమాఖ్య అధ్యక్షుడు రామమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 15తేదీ వరకు కంచి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్ర సరస్వతి, విజయేంద్రసరస్వతి, శంకర విజయేంద్రసరస్వతి స్వాములతో లోక కళ్యాణార్థం చాతుర్మాస పూజాహోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు తాలూకా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి



పుంగనూరులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప,
వి.కోటలో కేక్ కట్‌చేస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

పుంగనూరు/ చౌడేపల్లె/ సోమల/ వి.కోట/ పలమనేరు/ గంగవరం/ బైరెడ్డిపల్లె, జూలై8: దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతిని పుంగనూరులో వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ప్రైవేటు బస్టాండ్‌లోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. ● చౌడేపల్లెలో వైసీపీ నాయకులు వైఎస్‌కు అంజలి ఘటించారు. వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి, నాయకులు రుక్మిణమ్మ, నరసింహారెడ్డి, పవన్ పాల్గొన్నారు. ● సోమలలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు వెంకటేశ్వరరావు, మోహన్, నాగేశ్వరరావు, ప్రభాకర్, సాంబయ్య పాల్గొన్నారు. ● వి.కోటలో వైఎస్‌కు జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, పలమనేరు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ అంజలి ఘటించారు. కేక్ కట్ చేశారు. పేదలకు అన్నదానం చేశారు. ● పలమనేరులో, గంగవరంలోని వైఎస్ విగ్రహాలకు మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పూల మాలలు వేశారు. అన్నదానం చేశారు. వీసీసీ సభ్యులు ఫైరోజ్ పాల్గొన్నారు. ● బైరెడ్డిపల్లెలో వైఎస్‌కు ఎంపీపీ రెడ్డెప్ప, జడ్పీటీసీ కేశవులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి అంజలి ఘటించారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం : ఎంపీ దగ్గుమళ్ల


పలమనేరులో ఎంపీ, ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

పలమనేరు, జూలై8 : ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం అని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు పేర్కొన్నారు. పలమనేరులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇక్కడ పారిశ్రామికవాడలో పరిశ్రమల స్థాపనకు పెట్టుబడిదారులు ముందుకు వస్తే కేంద్రం నుంచి తగిన సహకారం అందిస్తామన్నారు. మ్యాంగో పోర్టు ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. పాకాల, చిత్తూరు, కుప్పంలలో రైల్వే అభివృద్ధికి కృషిచేస్తానన్నారు. ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మాట్లాడుతూ పరిశ్రమలతో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు ఆర్వీ బాలాజీ, ఖాజాపీర్, నాగరాజు, సోమశేఖర్‌గౌడు పాల్గొన్నారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యేలను నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

కుప్పం అభివృద్ధికి సహకారం

కుప్పం, జూలై 8: కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందిస్తానని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు హామీ ఇచ్చారు. ఎంపీగా విజయం సాధించిన తర్వాత ఆయన మొదటిసారిగా సోమవారం కుప్పం వచ్చారు. టీడీపీ నాయకులతో, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తన విజయానికి సహకరించిన స్థానిక నాయకులకు, కార్యకర్తలకు, నియోజక వర్గ ప్రజలకు ధన్యవాదాలు తెలియ జేశారు. ఎంపీ నిధుల నుంచి అవసరమైన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తానన్నారు. చిత్తూరులో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశానన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు ఎంపీ ప్రసాదరావుకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి మనోహర్, టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరిస్తా

ఆత్మీయ సమావేశం అనంతరం ఎమ్మెస్సీ నాయకుడు దేవరాజ్ అభ్యర్థన మేరకు మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ భవన్, శాంతిపురం కడపల్లె వద్ద ఉన్న అంబేడ్కర్ గురుకుల పాఠశాలలను సందర్శించారు. నియోజకవర్గంలోని దళిత కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. శాంతిపురంలో అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవానికి ఆర్థిక సాయం కావాలని, శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలని దేవరాజ్ కోరగా అధికారులతో మాట్లాడి ప్రణాళికలు సిద్ధం చేయిస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్సీ నాయకులు గోవిందప్ప, ఎన్.బాల, చంద్రబాబు, ఇతర నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వి.కోట: కుప్పం పర్యటన ముగించుకుని వి.కోటకు చేరుకున్న ఎంపీకి టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రంగనాథ్, కార్యదర్శి ఈశ్వర్, మండల తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, జిల్లా కార్యదర్శి శబరీష్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిపురం: కుప్పంలో ఆత్మీయ సమావేశానికి విచ్చేసిన ఎంపీ ప్రసాద్‌రావుకు శాంతిపురం టీడీపీ మండలాధ్యక్షులు విశ్వనాథ నాయుడు, నాయకులు స్వాగతం పలికారు.

అది కార్పొరేషన్ నిధులతో వేసిన రోడ్డే

మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇంటిముందు రోడ్డు వివాదంపై నివేదిక సిద్ధం

తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ నిధులతో 18వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్- రాయల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ వేసిన రోడ్డు కార్పొరేషన్ నిధులతో వేసిందేనని మున్సిపల్ అధికారులు నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తన ఇంటి ముందు కార్పొరేషన్ వేసిన రోడ్లకు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకుండా రెండు వైపులా పెద్ద గేట్లు ఏర్పాటు చేయడంపై వివాదం రేగిన విషయం తెలిసిందే. దీనిపై జనసేన తరపున నాలుగు రోజుల ముందు పెద్దిరెడ్డి ఇంటిముందు ధర్నాకు దిగిన నేపథ్యంలో రోడ్డు వివాదంపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివేదిక కోరారు. మారుతీనగర్-రాయల్ నగర్ కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ.9.55లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20) ఒకటి, రూ.9.50లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20)లతో మరొకటి రెండు విడతలుగా నామినేషన్‌పై టెండరిచ్చినట్టు గుర్తించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్‌నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డులో నమోదుచేసిన విషయాన్ని కూడా నిర్ధారించారు. అయితే అది తన స్థలమేనని పెద్దిరెడ్డి కోర్టును ఆశ్రయించినట్టు తెలుస్తోంది.

బోయకొండ ఈవో బాధ్యతల స్వీకరణ



ఈవోలు ఏకాంబరం, చంద్రమౌళికి జ్ఞాపికలు అందజేస్తున్న సిబ్బంది

చౌడేపల్లె, జూన్ 8: బోయకొండ గంగమ్మ ఆలయ ఈవోగా ఏకాంబరం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బోయకొండ ఈవోగా పనిచేస్తున్న చంద్రమౌళి గుంటూరు జోన్ జేవీవోగా బదిలీ అయ్యారు. దీంతో దేవదాయశాఖ కమిషనరు ఆదేశాలతో శ్రీకాళహస్తిలో పనిచేస్తున్న తాను బోయకొండ ఈవోగా బాధ్యతలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తానన్నారు. కాగా, నూతన ఈవో ఏకాంబరం, గుంటూరుకు బదిలీ అయిన ఈవో చంద్రమౌళిని ఆలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

భాకరాపేట ఘాట్‌లో లోయలోకి దూసుకెళ్లిన లారీ



చంద్రగిరి, జూలై 8: చంద్రగిరి మండల పరిధిలోని పీలేరు, తిరుపతి జాతీయ రహదారిలోని భాకరాపేట ఘాట్ రోడ్డులో లారీ అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. భాకరాపేట నుంచి తిరుపతి వైపు వస్తున్న లారీ ఘాట్ రోడ్డు మలుపు వద్దకు రాగానే అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో డ్రైవర్ మధుబాబు, క్లీనర్‌లకు ప్రాణాపాయం తృటిలో తప్పింది. సమాచారం అందుకున్న చంద్రగిరి పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు

తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 78,912 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,039 మంది తలనీలాలు సమర్పించారు.

నీట్ సీట్స్ అలాట్‌మెంట్ బుక్‌లెట్లు సిద్ధం

- **9849016661 నంబరుకు వాట్సప్ సందేశం పంపితే వివరాలు**

తిరుపతి(విద్య), జూలై 8: నీట్ సీట్స్ అలాట్‌మెంట్ బుక్‌లెట్లు సిద్ధమైనట్లు ఐఐటీ, నీట్ ఫోరం ఓ ప్రకటనలో తెలిపింది. నీట్ యూజీ-2024 ప్రవేశ పరీక్ష రాసి ర్యాంక్స్ పొందిన విద్యార్థుల అవగాహన కోసం నీట్-2023 సీట్ అలాట్‌మెంట్ బుక్‌లెట్స్‌ను సిద్ధం చేసినట్టు ఫోరం వెల్లడించింది. మొత్తం 19 బుక్‌లెట్స్ ద్వారా ఎంబీబీఎస్, బీడీఎస్ రౌండ్ 1, రౌండ్ 2, మాప్ అప్ రౌండ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ర్యాంక్ వారీ, రిజర్వేషన్‌వారీగా సీట్ల కేటాయింపు వివరాలను పొందుపరిచినట్టు వెల్లడించారు. డిజిటల్ రూపంలో బుక్‌లెట్లను పొందగోరువారు, ఇతర సమాచారం కోసం నీట్ బుక్‌లెట్ అని టైప్‌చేసి వాట్సప్ నంబరు 98490 16661 నంబరుకు మెసేజ్ పంపాలని సూచించారు.

టీటీడీ గదులు హైజాక్!

- రూ.100 వసతి గది.. రూ.వెయ్యికి విక్రయం
- గదులు దొరకని భక్తులే టార్గెట్
- ఉత్తరాది నుంచి వచ్చిన దళారుల దందా ఇది
- టీటీడీ విచారణలో నివ్వెరపోయే అంశాలు
- నాటి వైసీపీ పాలనా వైఫల్యంతోనే ఈ దుస్థితి



తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులే వారి టార్గెట్. దర్శన సమయం వచ్చే వరకు నిరీక్షించడానికి వసతి అవసరం కనుక అలాంటి వారినే ఎరవేస్తారు!. టీటీడీ వంద, 50 రూపాయలకు అద్దె కిచ్చే గదిని ముందుగానే బుక్ చేసుకుని హైజాక్ చేసి, గదులు దొరకని భక్తులకు అప్పటికప్పుడు రూ.వెయ్యి రూపాయలకు అంటగడతారు. డిమాండ్‌ను బట్టి అంతకుమించి వసూలు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనావైఫల్యం పుణ్యమాని పవిత్ర పుణ్యక్షేత్రంలో రోజూ కొందరు ఉత్తరాది నుంచి వచ్చిన దళారుల దందా ఇది. తిరుమలలో గదుల దళారులను అరికట్టేందుకు పోలీస్, విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణలో నివ్వెరపోయే అంశాలు బయటపడుతున్నాయి. మార్ఫింగ్ ఆధార్ కార్డు జిరాక్స్‌లతో గదులను పొంది బ్లాక్‌లో విక్రయించేందుకు నార్త్ ఇండియా నుంచి కొందరు తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో తిష్ఠవేయడం ఆశ్చర్యపరుస్తోంది.

● అక్రమార్జనకు దందా సాగించేదిలా!

ఆధార్ కార్డులో ఫొటో మార్ఫిడి చేసి గదులను బుక్ చేసుకోవడం ద్వారా అక్రమాలకు పాల్పడుతున్న వైనం మూడురోజుల క్రితం వెలుగు చూసిన విషయం తెలిసిందే. తొలుత సమీప బంధువు ఆధార్ కార్డుతో గదిని పొంది, ఆ తర్వాత గది కోసం నిరీక్షించే భక్తుడికి బ్లాక్‌లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు విక్రయించడం, విక్రయించే క్రమంలోనే ఆ భక్తుడి నుంచి ఆధార్ తీసుకోవడం, తిరిగి భక్తుడి నుంచి పొందిన ఆధార్ జిరాక్స్‌లోని ఫొటోను మార్చి దళారీ ఫొటో జతచేసి తిరిగి గదిని పొందే పెద్ద స్కాంను భద్రతాధికారులు గుర్తించారు. నవకిశోర్ అనే దళారిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఇదే తరహాలో 25 నుంచి 30 మంది దళారులు గదుల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నట్టు తేలింది. కేవలం గదుల ద్వారా అక్రమాలకు పాల్పడేందుకే మహారాష్ట్ర నుంచి కొంతమంది కుటుంబాలతో వచ్చి తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో గదులకు అద్దెకు తీసుకుని నివాసముంటున్నట్లు కూడా తేలింది. తెలంగాణ, కర్ణాటకల నుంచి కూడా మరికొంతమంది తిరుపతికి వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకున్నట్టు తెలిసింది. ఉదయం భక్తుల్లా తిరుమలకు వచ్చి గదుల ద్వారా వచ్చే సొమ్మును జేబులో వేసుకుని తిరిగి కొండ దిగేస్తున్నట్టు విచారణలో తేలింది. దీన్నిబట్టి గదులను బ్లాక్‌లో విక్రయించడం ద్వారా ఏ స్థాయిలో సంపాదన ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒక్కొక్కరు కనీసం రూ.60వేల నుంచి లక్ష వరకు అక్రమంగా సంపాదిస్తుండగా.. సమయానికి గదులు దొరక్క భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే తిరుమలలో ఇలాంటి దుస్థితి నెలకొందని, కూటమి సర్కారు ప్రక్షాళన చేపట్టి ఇలాంటి అక్రమాలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.

కలెక్టరేట్‌లో వినతుల వెల్లువ



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, జూలై 7: కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమంలో బాధితుల నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్ అర్జీలను స్వీకరించారు.బాధితుల సమస్యలను ఆలకిస్తూ..అర్జీలను త్వరగా పరిష్కరించాలని జిల్లా అధికారులకు సూచనలు ఇచ్చారు. రెవెన్యూ సమస్యలపై సంబంధిత తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లేదా ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపారు. అప్పటికప్పుడు పరిష్కారం కాని సమస్యలను నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి 194 మంది అర్జీదారులు హాజరై వినతిపత్రాలను ఇచ్చారు. వీటిలో రెవెన్యూకు సంబంధించి 171, డీఆర్వోకు 5, నేషనల్ హైవేకు 5, పోలీసుశాఖకు 3 అర్జీలు అందగా మిగిలిన మున్సిపాలిటీ, డ్వామా, డీసీవో, ఎస్ఎస్ఏ, తదితర శాఖలకు 10 అర్జీలు అందాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. కాగా, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, డ్వామా పీడీ రాజశేఖర్ తదితరులు వినతిపత్రాలను స్వీకరించారు. అధికారుల దృష్టికి వచ్చిన అర్జీల్లో కొన్ని...

- గత ప్రభుత్వం రద్దు చేసిన సామాజిక భద్రత పింఛన్లను పునరుద్ధరించాలని జిల్లా బధిరుల సంఘం నేతలు డిమాండు చేశారు. ఒకే కుటుంబంలో ఇద్దరు బధిరులుంటే ఇద్దరికీ పింఛన్లు ఇవ్వాలన్నారు. సబ్సిడీ రుణాలను అందించాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం సర్టిఫికెట్ల పంపిణీలో తప్పులు జరుగుతున్నాయని, వాటి వల్ల నిజమైన బధిరులు నష్టపోతున్నారన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో తమకు న్యాయం చేయాలని కోరారు.
- రస్తా పరంబోకు భూములు ఆక్రమణలకు గురికావడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గంగవరం మండలం గొర్రెలదొడ్డి గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణదారుడిపై స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని వాపోయారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.
- తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఉపాధి హామీ పథక క్షేత్రసహాయకులు డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ. 20వేలు ఇవ్వాలని, అర్హులకు పదోన్నతులు, రాజకీయ ఒత్తిళ్లను నివారించాలని కోరారు.



ఉపాధిసిబ్బందికి న్యాయం చేయాలని కలెక్టరేట్‌కు వచ్చిన ఉద్యోగులు



- శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని చిత్తూరు చర్చిల అభివృద్ధి సమితి అధ్యక్షుడు రెవరెండ్ జోబ్, కోశాధికారి రెవరెండ్ రాబర్ట్ ఫిర్యాదు చేశారు. చిత్తూరు రూరల్ మండలం అనుపల్లి పంచాయతీ వైఎస్సార్ నగర్‌లో కేటాయించిన భూమిలోకి తమను వెళ్లనీయకుండా అసాంఘిక శక్తులు అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నాయని ఆరోపించారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, జిల్లా అధికారులే న్యాయం చేయాలని కోరారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 39 ఫిర్యాదులు అందాయని ఎస్పీ మణికంఠ తెలిపారు. ఇందులో డబ్బు తగాదాలు 11, భూ తగాదాలు 14, వేధింపులు 6, ఆస్తి తగాదాలు 5, కుటుంబ తగాదాలు 3 వంతున అందాయి. కార్యక్రమంలో ఏఎస్పీ అరీఫుల్లా, దిశ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ



రోడ్డు పక్కనే కూర్చున్న జనం, వాహనాల డ్రైవర్లు, పార్కింగ్‌స్టాండ్‌లో కూర్చున్న అర్జీదారులు

వసతుల్లేక.. అర్జీదారుల ఇక్కట్లు

చిత్తూరు, జూలై 7: జిల్లా కలెక్టరేట్‌కు వివిధ పనులపై వచ్చే ప్రజల బాధలు వర్ణనాతీతం. కనీస వసతులైన బెంచీలు, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. కలెక్టరేట్ సముదాయంలో దాదాపు 50శాఖలకు పైనే వివిధ ప్రభుత్వ కార్యాలయాలు పనిచేస్తున్నాయి. ఈ కార్యాలయాల్లో వివిధ పనులపై ప్రతి రోజు వందల మంది ప్రజలు వస్తుంటారు. కార్యాలయాల్లో జరిగే సమావేశాలకు ఇతర ప్రాంతాల నుంచి అధికారులు, రాజకీయ నాయకులు కూడా వందల సంఖ్యలో వచ్చిపోతుంటారు. ఇక సోమవారమైతే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల వందల సంఖ్యలో అర్జీదారులు వస్తుంటారు. వారికి సరిపడే సౌకర్యాలను కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. అర్జీలివ్వడానికి వచ్చే వారికి హాలు ముందు ఉన్న పార్కింగ్‌షెడ్డులో కుర్చీలు వేసి ఉంచారు.

వారితో పాటు వచ్చే వారు గంటల తరబడి నిల్చోవాల్సిన పరిస్థితి ఉంది. అంతేకాకుండా అధికారులను తీసుకొచ్చే వాహన డ్రైవర్లు, రాజకీయ నాయకులతో వచ్చే కార్యకర్తలు, నాయకులు సైతం చెట్ల కిందనో, వాహనాలపైనో కూర్చుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారు కూర్చోడానికి బెంచీలు, తాగునీటి వసతి కల్పించాల్సిన అవసరముంది.

ఎన్‌ఆర్‌ఐ కిడ్నాప్

నగలు, నగదు లాక్కుని వదిలిపెట్టిన వైనం

శ్రీకాళహస్తి, జూలై 8: విదేశాల్లో చాలాకాలం ఉద్యోగం చేసి తిరుపతిలో స్థిరపడేందుకు సిద్ధమైన ఓ ఎన్ఆర్ఐను కొందరు కిడ్నాప్ చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది.తిరుపతికి చెందిన కృష్ణమూర్తి(65) సుదీర్ఘకాలం వివిధ దేశాల్లో ఉద్యోగాలు చేశాడు. ఇటీవల సొంతూరు తిరుపతికి వచ్చి చైన్‌లింక్ వ్యాపారం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఓ సెల్‌ఫోన్ దుకాణంలో పనిచేసే యువతి(26)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య బాగా చనువు పెరిగింది. గతంలో ఎర్రచందనం కేసులో నిందితుడిగా వుండిన ఆ యువతి భర్త ఎలాగైనా కృష్ణమూర్తిని దోపిడీ చేయాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో తనతో పాటు ఎర్రచందనం కేసులో నిందితుడైన మరో యువకుడిని సహాయంగా ఎంచుకున్నాడు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో కొందరు సభ్యులు చైన్‌లింక్ వ్యాపారంలో చేరుతారని కృష్ణమూర్తిని నమ్మించారు.ఈనెల 3వ తేదీ కారులో అందరూ రాజీవ్‌నగర్‌కు చేరుకున్నారు. ఇక్కడ యువతి భర్త ముందుగా వేసుకున్న పథకం ప్రకారం కృష్ణమూర్తి సెల్‌ఫోన్ లాక్కుని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాడు. అక్కడినుంచి మరో ఇద్దరి సాయంతో కేవీబీపురం మండలం పెరిందేశానికి తరలించారు. కృష్ణమూర్తి వద్ద ఉన్న కొంత నగదుతో పాటు బంగారు ఆభరణాలను లాక్కున్నారు. అలాగే బ్యాంకు ఖాతాలోని రూ.3లక్షల నగదును ఏటీఎం, ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా స్వాహా చేశారు. ఆ తరువాత కృష్ణమూర్తి భార్యకు ఫోన్‌చేసి రూ.కోటి డిమాండ్ చేశారు. 4వ తేదీ పెరిందేశం నుంచి కారులో కృష్ణమూర్తిని ఎక్కించుకుని శ్రీకాళహస్తి మండలంలోని పల్లెల మీదుగా సంచరించారు. అతని నుంచి డబ్బులు రావని నిర్ధారించుకున్న తరువాత రాజీవ్‌నగర్‌లో వదిలిపెట్టి పరారయ్యారు. రెండు రోజుల పాటు దుండగుల మధ్య నలిగి గాయపడిన కృష్ణమూర్తి నేరుగా తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరాడు. కోలుకున్నాక సోమవారం రాత్రి శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కిడ్నాప్ ఘటనపై ఫిర్యాదు చేశాడు. దీంతో కిడ్నాప్‌కు పాల్పడిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఒక స్మగ్లర్ అరెస్టు



పట్టుబడ్డ ఎర్రచందనంతో టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, జూలై 8: అన్నమయ్య జిల్లా పీలేరు అటవీప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం కూంబింగ్ నిర్వహించి, 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌ఛార్జి, తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డికి చెందిన విష్ణువర్ధన్‌కుమార్ బృందం ఆదివారం అన్నమయ్య జిల్లా కేవీపల్లి మండలం పీలేరు అటవీ ప్రాంతంలో ఎల్లమందకు చేరుకుని మంచాల మంద వైపు కూంబింగ్ చేసుకుంటూ వెళ్లారు. తెల్లవారుజామున వీరు మారెళ్ల అటవీ బీటు పరిధిలో పింఛానది సమీపానికి చేరుకోగా కొంతమంది వ్యక్తులు తలలపై ఎర్రచందనం దుంగలు మోసుకుని వెళుతూ కనిపించారు. టాస్క్‌ఫోర్సు పోలీసులు వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా.. వారు దుంగలను పడేసి పారిపోయారు. వారిని వెంబడించిన పోలీసులు ఒకరిని పట్టుకోగలిగారు. అతడు తమిళనాడు వేలూరు జిల్లా అనైకట్టు ప్రాంతానికి చెందిన బలరామన్ పెరియస్వామి(44)గా గుర్తించి, అరెస్టు చేశారు. అక్కడ పడి ఉన్న 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వ్యక్తిని, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎస్ఐ సీహెచ్ రఫీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విధుల్లోని సిబ్బందికి రక్షణ కల్పించండి

రుయా పరిపాలనా భవనం ముందు స్టాఫ్ నర్సుల నిరసన



నినాదాలు చేస్తున్న నర్సులు

తిరుపతి(వైద్యం), జూలై 8: విధుల్లోని సిబ్బందికి రక్షణ కల్పించాలని రుయాస్పత్రిలోని స్టాఫ్‌నర్సులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రి పరిపాలన భవనం ముందు నిరసన తెలిపారు. ఏఎంసీ వార్డుకు విధులకు హాజరైన కాంట్రాక్టు స్టాఫ్‌నర్సు యశోదపై ఆదివారం రాత్రి ఓ రోగి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన విషయాన్ని ఖండించారు. వీరికి మద్దతుగా ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఏపీఎన్జీవోస్ నేతలు వరప్రసాద్, సురేష్ నిలిచారు. నేతలు మాట్లాడుతూ.. మహిళా ఉద్యోగులకు భద్రతగా మగ సెక్యూరిటీ గార్డులను అందుబాటులో ఉంచాలన్నారు. వెంటనే జరిగిన విషయంపై విచారణ చేపట్టి బాధితురాలికి వైద్య ఖర్చులు భరించడమే కాకుండా వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం యూనియన్ నేతలతో కలిసి స్టాఫ్‌నర్సులు సూపరింటెండెంట్ రవిప్రభుకు వినతిపత్రం అందజేశారు. దాడి చేసిన వ్యక్తికి మతిస్థిమితం లేని కారణంగా ఇలాంటి దురదృష్ట ఘటన జరిగిందని, అతనిపై చర్యలు తీసుకుంటామని, బాధితురాలికి సెలవులు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. హెడ్‌నర్సులు, రాధ, భువనేశ్వరి ఏపీ హంస నేతలు ఇమ్రాన్, గిరిబాబు, శాంతకుమార్, స్వర్ణలత, జయలక్ష్మి పాల్గొన్నారు.

దాడి ఘటనపై మంత్రి ఆరా

సోమవారం సాయంత్రం రుయా సూపరింటెండెంట్ రవిప్రభుకు ఫోన్ చేసి జరిగిన ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. బాధితురాలు కోలుకునే వరకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేస్తామని, వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. కాగా, తక్షణమే స్పందించిన మంత్రికి ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఏపీఎన్జీవోస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు నైనారు వరప్రసాద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

నిందితుడిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం): స్టాఫ్ నర్సుపై దాడి చేసిన ఘటనలో నిందితుడు దుర్గాప్రసాద్‌పై తిరుపతి వెస్ట్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ జయనాయక్ తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె పట్టణం రాజానగర్‌కు చెందిన దుర్గాప్రసాద్ రుయాలో చికిత్స పొందుతున్నాడు. శనివారం రాత్రి అట్రాసిన్ ఇంజక్షన్ ఇచ్చారు. అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయి ఉన్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విధులకు హాజరైన స్టాఫ్ నర్సు యశోదపై ఉన్నట్టుండి సెలైన్ స్టాండుతో తలపై దాడి చేశాడు. నర్సు తలకు తీవ్రగాయమైంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితుడు చికిత్స పొందుతుండడంతో డిశ్చార్జి చేశాక అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

తిరుమలేశుడి సేవలో కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి



తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్న తీర్థస్వామి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో మహాద్వారం వద్దకు చేరుకున్న విద్యాప్రసన్నకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శిష్యబృందంతో ఆలయంలోకి వెళ్లిన విద్యాప్రసన్న ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అదేవిధంగా శ్రీవారిని గోవా స్పీకర్ రమేష్ తవడ్కర్, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

సంస్కృతవర్సిటీలో బ్రిడ్జ్ కోర్సు ప్రారంభం

తిరుపతి రూరల్, జూలై 8: తిరుపతిలోని జాతీయ సంస్కృతవర్సిటీలో ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా ఆచార్య(పీజీ) కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఐదురోజులపాటు నిర్వహించే బ్రిడ్జ్ కోర్సుని సోమవారం వర్సిటీలోని చెలికాని అన్నారావు సభా భవనంలో ప్రారంభించారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ వర్సిటీలో ఆఫర్‌చేసే 15కిపైగా వివిధశాస్త్రాలకు సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు పరిచయం చేసేందుకు ప్రతిఏటా ఈ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. సంస్కృత భాష, శాస్త్రాల్లోని జ్ఞానాన్ని సరళంగా, సులభంగా తెలుసుకునేందుకు ఈ బ్రిడ్జ్ కోర్సు ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అకడమిక్‌డీన్ శుక్లా, కోఆర్డినేటర్ సి.రంగనాథన్, అడిషనల్ కోఆర్డినేటర్ యశస్వి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాముకాటుకు రైతు మృతి



చంద్ర(ఫైల్)

పుంగనూరు రూరల్, జూలై 8: పాముకాటుకు ఓ రైతు మృతి చెందిన ఘటన సోమవారం పుంగనూరులో చోటు చేసుకుంది. మృతుడి కుటుంబీకుల కథనం మేరకు.. పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె పంచాయతీ ఆవులపల్లెకు చెందిన ఎల్లప్ప కుమారుడు చంద్ర(45) ఆదివారం పొలంలో పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. ఈయన కేకలతో సమీప పొలాల్లోని రైతులు చేరుకుని చంద్రను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు అతని పరిస్థితి విషమించదని చెప్పడంతో తిరుపతికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపారు.

రేపు సఫాయి కర్మచారీ చట్టంపై సమావేశం

చిత్తూరు, జూలై 8: కలెక్టరేట్ సమావేశపు హాలులో బుధవారం సఫాయి కర్మచారీ చట్టం అమలుపై జిల్లా సఫాయి కర్మచారీ నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరుగుతుందని సాంఘిక సంక్షేమ, సాధికారిత అధికారిణి రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి కమిటీ సభ్యులందరూ తప్పక హాజరుకావాలని కోరారు.

మామిడిలో తేనెమంచు పురుగును నివారించాలి

చిత్తూరు (సెంట్రల్), జూలై 8: మామిడిలో తేనెమంచు పురుగు నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానాధికారి మధుసూదన్‌రెడ్డి సూచించారు. పిందె దశలో దీని ఉధృతి ఎక్కువగా ఉంటుందని, పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. పురుగు సోకిన దశలో మండల ఉద్యాన అధికారుల సలహాతో రసాయన మందులు పిచికారీ చేసి, వాటి ప్రభావాన్ని తగ్గించాలన్నారు. పురుగు సోకిన కొమ్మలను కత్తరించడం మరింత ప్రయోజనకరంగా ఉంటుందని సూచించారు.

విద్యుత్ పనులను త్వరగా పూర్తి చేయండి


పనులను పరిశీలిస్తున్న ఈఈ మునిచంద్ర

చిత్తూరు రూరల్, జూలై 8: తేనెపల్లి వద్దనున్న టిడ్కో హౌసింగ్ కాలనీలో విద్యుత్ శాఖకు సంబంధించిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఆదేశించారు. కాలనీలో జరుగుతున్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఇప్పటికే 18 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని, మిగిలున్న పనులను మరో 20 రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు.

ఎరువుల వాడకంపై కళాజాత



నగరి, జూలై 8: నగరి సహకార సంఘం పరిధిలోని అయనంబాకం, నంబాకం పంచాయతీల పరిధిలో ఎరువులు, క్రిమి సంహారక మందులపై రైతులకు అవగాహన కల్పిస్తూ కళాజాత నిర్వహించినట్లు ఇఫ్‌కో సీఈవో తులసిపిళ్లై పేర్కొన్నారు. ఏయే పంటలకు ఎంత మోతాదులో ఏ రకం ఎరువులు వాడాలో పాటల రూపంలో రైతులకు వివరించినట్లు చెప్పారు. తెగుళ్ల నివారణపైనా అవగాహన కల్పించామన్నారు.

ఇంటర్ విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


సైకిళ్లు అందజేస్తున్న డీఐఈవో సయ్యద్ మౌలా

చిత్తూరు (సెంట్రల్), జూలై 8: దాతల సాయంతో ఇంటర్ విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు అందించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి సయ్యద్ మౌలా తెలిపారు. సోమవారం స్థానిక బీఎస్ కన్నన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లు అందజేశారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థులకు దాతల సహకారంలో పలు రకాల ప్రయోజనాలు కల్పించనున్నట్లు తెలిపారు.

స్టాప్ డయేరియాపై అవగాహన

యాదమరి, జూలై 8: స్టాప్ డయేరియా కార్యక్రమంపై మండలంలోని దాసరాపల్లె గ్రామస్థులకు సోమవారం అవగాహన కల్పించారు. సీహెచ్‌వో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దోమకాటు వల్లే డెంగ్యూ వస్తుందని, నివాసాల్లో నీటిని నిల్వ ఉంచరాదని, ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని అన్నారు. వర్షాకాలం విధిగా దోమతెర వాడాలని సూచించారు.

రేపు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

కార్వేటినగరం, జూలై 8: కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు తెలిపారు. 'సమస్యలు మీవి.. పరిష్కారం మాది' పేరుతో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యేకు తెలియజేసే అవకాశం కలుగుతుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొండమల్లీశ్వరస్వామికి పాలాభిషేకం


ప్రత్యేక అలంకరణలో స్వామి

వెదురుకుప్పం, జూలై 8: డీఆర్ఎన్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞానప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజలు, పాలాభిషేకం చేశారు. అన్నమయ్య, శివ సంకీర్తనలు ఆలపించారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం అందజేశారు. చవటగుంట అవుదేవర నందీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌కు భూమిపూజ



గంగాధరనెల్లూరు, జూలై 8: ఎమ్మెల్యే డాక్టర్ థామస్ సహకారంతో క్రిస్టియన్ సంస్థ ద్వారా మండలంలోని వింజం దళితవాడలో రూ.10లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. సోమవారం జరిగిన భూమిపూజలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు. టీడీపీ వింజం గ్రామ కమిటీ అధ్యక్షుడు సతీష్‌కుమార్, ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి సగికుమార్, బీసీ సెల్ మండలాధ్యక్షుడు జ్యోతియాదవ్, నేతలు శ్రీరాములు, గురుస్వామి, ఎత్తిరాజులు, జైపాల్ పాల్గొన్నారు.

ఉచిత ఇసుక నిరుపేదలకు వరం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

గుడిపాల, జూలై 8: ఉచిత ఇసుక నిరుపేదలకు వరం లాంటిదని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు అన్నారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెల వ్యవధిలోనే అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ముందుగా పింఛన్ల పెంపు, ఉచిత ఇసుకను అమలు చేయడం హర్షణీయమన్నారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ రవినాయుడు, మాజీ ఎంపీటీసీ తుమ్మల సాంబశివ నాయుడు, టీడీపీ నాయకులు గోపి, యోగానంద నాయుడు, రాజు, అర్జున్ పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపులు



గుడిపాల, జూలై 8: మండలంలోని బొమ్మసముద్రం క్రాస్ నుంచి పల్లూరు మఠం వరకు వెళ్లే రహదారిలో ప్రమాదకరమైన మలుపులున్నాయి. దక్షిణ బ్రాహ్మణపల్లి (డీబీపల్లి), కోటూరు, చింతగుంటూరు, ఆల్పాగుంట సమీపంలో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. ఎలాంటి సూచిక బోర్డులూ ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

11న ఉచిత కంటి వైద్య శిబిరం

పాలసముద్రం, జూలై 8: మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 11న చెన్నై ఎం.ఎన్.కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న ఉచిత కంటి వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మోహనకృష్ణ కోరారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కంటి పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా చేస్తామని చెప్పారు.

హాస్టల్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



బంగారుపాళ్యం, జూలై 8: స్థానిక గురుకుల పాఠశాల హాస్టల్ విద్యార్థులకు తుంబకుప్పం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లోహిత్ సోమవారం వైద్య పరీక్షలు చేశారు. డెంగ్యూ, మలేరియా, డయేరియా లక్షణాలను విద్యార్థులకు వివరించారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, జ్వరం వస్తే అశ్రద్ధ చేయవద్దని సూచించారు. హాస్టల్ పరిసరాలను పరిశీలించి, తాగునీటి ట్యాంకును 15 రోజులకొకసారి క్లోరినేషన్ చేయించాలని సిబ్బందికి సూచించారు. ఎంఈవో-2 రమేష్‌బాబు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై చర్యలు తీసుకోండి

యాదమరి, జూలై 8: పిల్లల తల్లుల పట్ల అమర్యాదగా వ్యవహరిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త సరళపై చర్యలు తీసుకోవాలని దళవాయిపల్లె సర్పంచ్ యశోద, గ్రామస్థులు సీడీపీవోను కోరారు. పౌష్టికాహారం సరిగా ఇవ్వడం లేదని, ఇదేమని అడిగిన పిల్లల తల్లిదండ్రులపై ఘర్షణకు దిగుతోందని ఆరోపించారు. పిల్లల బాగోగులను పట్టించుకోని ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

చిత్తూరు, జూలై 8: నిత్యం రద్దీగా ఉండే చర్చివీధిలో రోడ్డు, ఫుట్‌పాత్‌లపై పెట్టిన వస్తువులను సోమవారం అధికారులు తొలగించారు. ఎమ్మెల్యే గురజాల ఆదేశాల మేరకు చర్చివీధి, బజారువీధి, పండ్ల మార్కెట్ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై ఉంచిన నేమ్‌బోర్డులు, ఇతర వస్తువులను తొలగించి, ట్రాఫిక్ ఇబ్బందుల్లేకుండా చేశారు. వాహనాల పార్కింగ్‌ను క్రమబద్ధీకరించారు.

గురుకుల పాఠశాల జూనియర్ కళాశాల ఏర్పాటు చేయండి


మంత్రికి వినతిపత్రమిస్తున్న సప్తగిరిప్రసాద్

చిత్తూరు సిటీ, జూలై 8: తవణంపల్లెలో గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ కోరారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల వీరాంజనేయస్వామిని కలసి వినతిపత్రం ఇచ్చారు.

రేపు గుడిమాన్యం భూముల కౌలు వేలం

గంగాధరనెల్లూరు, జూలై 8: స్థానిక అల్లిఎల్లమ్మ ఆలయ భూములను కౌలుకు ఇచ్చేందుకు బుధవారం ఉదయం 10 గంటలకు గుడి ఆవరణలో వేలం వేయనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి సి.ఆర్.తిమ్మారెడ్డి తెలిపారు. సర్వేనంబర్ 216లో 1-06 ఎకరాలు, 303లో 0-72 సెంట్లు కౌలుకు ఇవ్వనున్నామని, 2024 జూన్ 30 నుంచి 2027 జూన్ 29వ తేదీ వరకు కౌలు కాలపరిమితి ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

అనధికార వాటర్‌ప్లాంట్లకు నోటీసులు

చిత్తూరు, జూలై 8: నగరంలో అనధికారికంగా ఉన్న వాటర్‌ప్లాంట్లకు నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు. సోమవారం చేపట్టిన తనిఖీల్లో ఫుడ్‌సేఫ్టీ, ఐఎస్ఐ వాటర్ టెస్టింగ్ సర్టిఫికెట్, ట్రేడ్ లైసెన్స్, వాటర్‌ప్లాంట్, బిల్డింగ్ అప్రూవల్ లేని ప్లాంట్లను గుర్తించి నోటీసులిచ్చారు.

ప్రేమ విఫలమైందని యువకుడి ఆత్మహత్య

చిత్తూరు, జూలై 8: ప్రేమ విఫలమైందన్న బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన చిత్తూరు నగరం సాంబయ్య కండ్రిగలో సోమవారం చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు సాంబయ్య కండ్రిగకు చెందిన అజయ్ (24) అదే కాలనీకి చెందిన ఒక అమ్మాయిని ప్రేమించాడు. ప్రేమించాలని కొన్ని రోజులుగా ఆమె వెంట తిరిగినా పట్టించుకోలేదు. మనస్తాపానికి గురైన అజయ్ ఇంటి పక్కనే ఉన్న సెల్‌ఫోన్ టవర్ ఎక్కి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికే తొలి ప్రాధాన్యం

టీడీపీ ముఖ్య నేతల సమావేశంలో ఎమ్మెల్యే గురజాల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, జూలై 8: పార్టీ కోసం పనిచేసే వారికే తొలి ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ స్పష్టం చేశారు. పార్టీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ కఠారి హేమలత అధ్యక్షతన సోమవారం పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఆయన సమావేశమయ్యారు. పార్టీని, నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని వైసీపీ మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను ఎటువంటి షరతులూ లేకుండా టీడీపీలో చేర్చుకున్నట్లు చెప్పారు. కొంత మంది టీడీపీ ఇన్‌చార్జులు మాట్లాడుతూ వైసీపీ నేతల వల్ల తాము ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, తమపై తప్పుడు కేసులు నమోదు చేశారని, ఇప్పుడు వారితో కలసి ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. నగర అభివృద్ధి జరగాలంటే అందరూ కలసి ముందుకెళ్లాలని ఎమ్మెల్యే సమాధానమిచ్చారు. నగర పాలక సంస్థలో టీడీపీకి కోరం ఉంటేనే బిల్లులు పాస్ అవుతాయని, అప్పుడే అన్ని డివిజన్లలో వసతుల కల్పనకు నిధులు మంజూరవుతాయని చెప్పారు. తప్పుడు కేసులుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తొలగించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీకోసం కష్టపడేవారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, పదవులు వెతుక్కుంటూ వస్తాయని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు సీఆర్ రాజన్, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, నేతలు కాజూరు బాలాజీ, త్యాగరాజన్, వసంత్ కుమార్, కాజూరు రాజేష్, శంకర్, సుబ్రి, సీఎం విజయ, ఈశ్వర్, అశోక్, రాణి, వరలక్ష్మి, విజయలక్ష్మి, అత్తుబాయ్ పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోండి


విద్యాసామగ్రి కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, జూలై 8: ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. సోమవారం తవణంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి కిట్లు, సైకిళ్లను ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విలువలతో కూడిన విద్య అందుతుందని, తద్వారా ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు. అనంతరం నోబల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. హెచ్‌ఎం దేవరాజులురెడ్డి, డీవైఈవో చంద్రశేఖర్, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి, ఎన్‌టీఏ జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్‌నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, నాయకులు సుధాకర్‌నాయుడు, మధు, శరవణ, గోపి యాదవ్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల వేదిక సమస్యలకు ప్రాధాన్యం


అర్జీలను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జూలై 8 : చిత్తూరు నగరపాలక సంస్థలో ప్రతి సోమవారమూ నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే వినతులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వాటిపై అక్కడికక్కడే అధికారులతో చర్చించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. మెప్మాకు 5, పబ్లిక్ హెల్త్‌కు 1, ఇంజనీరింగ్‌కు శాఖకు 2 చొప్పున వినతులు అందాయి. సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంఈ గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.

తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు : ఎస్పీ


రేణుకకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూలై 8 : తప్పు చేసిన వారు శిక్ష అనుభవించాలని, అప్పుడే మరొకరు తప్పు చేయడానికి సాహసించరని ఎస్పీ మణికంఠ అన్నారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం అనంతరం ఆయన పలువురు కోర్టు కానిస్టేబుళ్లకు ప్రశంసాపత్రాలు అందించారు. 2014లో బాలికపై జరిగిన అత్యాచార ఘటనలో ముద్దాయికి శిక్ష పడటానికి అవసరమైన అన్ని సాక్ష్యాలను కోర్టు ముందుంచడంలో ప్రతిభ కనబరిచిన కోర్టు మానిటరింగ్ ఏఎస్ భక్తవత్సలం, కోర్టు కానిస్టేబుల్ రేణుక, గుడుపల్లె కానిస్టేబుల్ సోమశేఖర్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రశంసాపత్రాలు అందించారు.

పాఠశాలకు సీఎం చిత్రపటం



వెదురుకుప్పం, జూలై 8: ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలకు సోమవారం ఆళ్లమడుగు గ్రామానికి చెందిన తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్ర పటాన్ని ఆ పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు. కార్యాలయంలో తగిలించాలని విజ్ఞప్తి చేశారు.

తోటకనుమలో వైద్యాధికారుల పరిశీలన



వి.కోట, జూలై 8: తోటకనుమ గ్రామంలో డెంగ్యూ జ్వరాలు వరుసగా నమోదు కావడం పట్ల అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో డా.వెంకటప్రసాద్ నేతృత్వంలో జిల్లా మలేరియాధికారి రామచంద్రారెడ్డి, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులురెడ్డి సోమవారం స్వయంగా గ్రామానికి చేరుకుని అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. డాక్టర్ మాధవి, ఏఎన్ఎంల ఆధ్వర్యంలో వైద్య శిబిరం కొనసాగుతోందని ఎంపీడీవో గోవర్ధన్ వారికి తెలిపారు. వైద్యాధికారుల ఆదేశాల మేరకు జ్వరాల వ్యాప్తికి కారణమైన తాగునీటి ట్యాంకును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గ్రామ కార్యదర్శి నేతృత్వంలో గ్రామస్థులు శుభ్రం చేశారు. అక్కడి తాగునీటి నమూనాలను పరీక్షల నిమిత్తం ర్యాపిడ్ రెస్పాన్స్ టీం చిత్తూరుకు పంపారు. మురుగునీటి కాల్వలను శుభ్రం చేశారు. దోమలు వ్యాప్తి చెందకుండా మలాథిన్ పిచికారీ చేశారు. ఏఎన్ఎంలు, ఆరోగ్య కార్యకర్తలు సర్వే నిర్వ హించి బాధితులకు మందులు అందించారు. కాగా డెంగ్యూ జ్వరాల బారిన పడి కుప్పం పీఈఎస్‌లో చికిత్స పొందుతున్న బాధితులను ఓగు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయ్ కాంత్ స్థానిక టీడీపీ నేతలతో కలసి పరిశీలిం చారు. బాధితులు కోలుకుంటున్నారని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఆంధ్రజ్యోతిలో వరుసగా ప్రచురితమైన కథనాలతో జిల్లా అధికార యంత్రాంగం తరలివచ్చి గ్రామంలో జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకున్నారని ప్రజలు అభినందనలు తెలిపారు.

కాశీవిశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం

రామకుప్పం, జూలై 8: రామకుప్పంలోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం అర్చకులు స్వామివారికి, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. సాయంత్రం ఉభయదారులు కుమ్మరి కనకరాజు కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

వేడుకగా అర్జున తపస్మాన్

కల్లూరు, జూలై 8: పులిచెర్ల మండలం మంగళంపేటలో కొన సాగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం అర్జున తపస్మాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అర్జునుడి వేషధారి తపస్మాన్‌ను ఒక్కో మెట్టు ఎక్కుతూ పద్యాలు వినిపిస్తూ తపస్మాన్ పైభాగానికి చేరుకొని భక్తులపైకి నిమ్మకాయలు, విభూది తదితరాలు విసిరారు. వాటి కోసం భక్తులు ఎగ బడ్డారు. ఉభయదారులుగా తిరుపతికి చెందిన కేవీ రమణ, గడ్డంవారిపల్లికి చెందిన రమణారెడ్డి కుటుంబసభ్యులు వ్యవహరించారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

గుడుపల్లె, జూలై 8: పెద్దబజనవాడలో గంగమ్మ అగ్నిగుండ ప్రవేశం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామంలో వెలసిన గంగమ్మ ఆలయం వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి ఆలయ పూజా రులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి అమ్మవారిని పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టు వస్త్రాలు, పూలహారాలతో అలంక రించి పుష్పాలతో అలంకరించిన పల్లకిపై అధిష్టింపజేశారు. డప్పువాయిద్యాల నడుమ గ్రామంలో ఊరేగిం చారు. ఆ తరువాత పచ్చిగెరిగె, అమ్మవారు అగ్నిగుండం ప్రవేశం చేశారు. అనంతరం గంగమ్మకు గ్రామంలోని మహిళలు పిండి దీపాలు వెలిగించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

చాతుర్మాస మహాయాగ మహోత్సవాన్ని విజయవంతం చేయాలి

పుంగనూరు రూరల్, జూలై8: చాతుర్మాస మహాయాగ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పురోహిత బ్రాహ్మణసమాఖ్య అధ్యక్షుడు రామమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 11 నుంచి 15తేదీ వరకు కంచి పీఠాధిపతులు చంద్రశేఖరేంద్ర సరస్వతి, విజయేంద్రసరస్వతి, శంకర విజయేంద్రసరస్వతి స్వాములతో లోక కళ్యాణార్థం చాతుర్మాస పూజాహోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు తాలూకా బ్రాహ్మణ సంక్షేమ సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయాల్లో విశేష పూజలు

రామకుప్పం, జూలై 8: రామకుప్పంలో గంగజాతరలో భాగంగా రెండో రోజైన సోమవారం అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. ఉదయం దిగువవీధి గంగమ్మ, శివాజీనగర్, రెడ్డివీధి, మాదిగవాడ, రామనగర్‌కాలనీ, కోదండరామనగర్‌కాలనీల్లోని అమ్మవారి ఆలయాల్లో ఉదయం ప్రత్యేక అభిషేకపూజలు నిర్వహించారు. భక్తులు ఆలయాలను సందర్శించి అమ్మవార్లకు కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. కాగా మంగళవారం పచ్చిగెరిగె ఊరేగింపు, అగ్నిగుండ ప్రవేశం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా పుష్పపల్లకీ సేవ

రొంపిచెర్ల, జూలై8: ముత్యాలమ్మ జాతరలో భాగంగా ఆదివారం రాత్రి అమ్మవారిని పుష్ప పల్లకీలో పట్టణంలోని పురవీధుల్లో ఊరేగించారు. మంగళ వాయిద్యాలు, బాణసంచా వెలు గుల మధ్య అమ్మవారి ఊరేగింపు కోలాహలంగా సాగింది. భక్తులు అమ్మవారికి మంగళ హారతులు సమర్పించారు.

స్వయంభేశ్వరుడికి అభిషేక పూజలు

సోమల, జూలై 8: సోమలలో కొలువుదీరిన స్వయంభేశ్వర స్వామి ఆలయంలో సోమ వారం మూలవిరాట్‌కు విశేష అలంకరణలు జరిపారు. అర్చకులు స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు శెట్టివారి నాగరాజ, దీప కుటుంబసభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పూజల్లో అడుసుపల్లె, సోమల, దాసరివారిపల్లె, దిడ్డివారిపల్లె, గన్నావారిపల్లె గ్రామాల భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్‌కు ఘన నివాళి


ఎస్ఆర్‌పురంలో నివాళులర్పించిన నారాయణస్వామి







నగరిలో కేక్ కట్ చేస్తున్న రోజా - వైఎస్‌గేటులో మౌనం పాటిస్తున్న సునీల్‌కుమార్ - శ్రీరంగంపల్లిలో మాట్లాడుతున్న విజయానందరెడ్డి

శ్రీరంగరాజపురం, జూలై 8: మాజీ సీఎం వై.ఎస్. రాజశేఖరరెడ్డి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలోని ఆయన విగ్రహానికి మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి పూలమాల వేసి, నివాళులర్పించారు. మాజీ జడ్పీటీసీ గురవారెడ్డి, స్థానిక సర్పంచ్ హరిత కుప్పయ్య పాల్గొన్నారు.

ఐరాల : మండలంలోని వైఎస్‌గేటులో భారీ కేక్ కట్ చేశారు. వైసీపీ పూతలపట్టు ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్, ఎంపీపీ మోహన్, మండలాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నగరి : మున్సిపాలిటీ పరిధిలోని ఓంశక్తి ఆలయం వద్ద, టవర్ క్లాక్ వద్ద గల వైఎస్సార్ విగ్రహాలకు మాజీ మంత్రి ఆర్కే రోజా పూలమాల వేసి, నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని దామరపాకంలో జరిగిన వైఎస్సార్ జయంతి వేడుకలలో ఆమె పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, దయాకర్, మునికృష్ణారెడ్డి, ఇంద్రయ్య, ఎంపీపీ భార్గవి ఆమె వెంట ఉన్నారు.

గుడిపాల : మండలంలోని శ్రీరంగంపల్లి దళితవాడలో వైఎస్ విగ్రహానికి వైసీపీ చిత్తూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఎంసీ విజయానందరెడ్డి పూలమాల వేసి, నివాళులర్పించారు. భారీ కేక్ కట్ చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు జనార్దన్, ఎంపీపీ ప్రసాద్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

విజయపురం : మండలంలోని పన్నూరు, పన్నూరు సబ్‌స్టేషన్, మాధవరంలో వైసీపీ నాయకులు వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ బాలాజీ, ఎంపీటీసీ రాజగోపాల్ పాల్గొన్నారు.

వెదురుకుప్పం : వెదురుకుప్పంలో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. వైసీపీ మండలాధ్యక్షుడు కామసాని పద్మనాభరెడ్డి, జడ్పీటీసీ చలంపాళ్యం సుకుమార్ పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు : ఎంపీడీవో కార్యాలయం ముందు గల వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ నేతలు పూలమాలవేసి నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, మండల ఆర్‌బీకే అడ్వైజరీ కమిటీ చైర్మన్ బలరామిరెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు పాల్గొన్నారు.

పాలసముద్రం : మండలంలోని రాచపాళ్యం కూడలిలో ఉన్న వైఎస్ విగ్రహానికి పార్టీ మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్, జడ్పీటీసీ అన్బు ఆధ్వర్యంలో పూలమాల వేసి, నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. అన్నదానం చేశారు.

బంగారుపాళ్యం : మండలంలోని కరిడివారిపల్లెలో మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుమార్ రాజా, మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. బంగారుపాళ్యంలో అన్నదానం చేశారు. జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి పాల్గొన్నారు.